

# ఎలిజీలు
## – గొల్లపూడి మారుతీరావు



*కౌముది ప్రారంభసంచిక నుంచి క్రమం తప్పకుండా కనిపిస్తున్న పేరు ఆత్మీయ మిత్రులు గొల్లపూడి మారుతిరావు గారు. ఆయన వ్రాసిన ఎన్నో నవలలు, కథలు , వ్యాసాలు, కాలమ్స్ కౌముదిలో వచ్చాయి. ఆనవాయితీ తప్పకుండా వారు వ్రాసిన ఎలిజీలు వ్యాసాలను నెలకొకటి చొప్పున పునర్ముద్రిస్తున్నాము. గొల్లపూడి మారుతిరావుగారు భౌతికంగా మన మధ్యన లేకపోయినా ఆయన అశీస్సులు కౌముదిని సదా వెన్నంటే ఉంటాయి.*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**భావనా నారాయణ**

ప్రఖ్యాత రచయిత సోమర్సెట్ మామ్ దాదాపు తన ఆఖరి రచనల్లో ఓదాంట్లో (సమ్మింగ్ అప్) ఇలా అంటాడు. "జీవితంలో నేను చెప్పాల్సిందంతా చెప్పేశాను. వ్రాయాల్సిందంతా వ్రాశాను. ఇప్పుడెవరయినా కొత్త రచయితలు అలమరలో నా స్థానాన్ని ఆక్రమించదలచుకుంటే ఆ స్థలం ఇవ్వడానికి అభ్యంతరం పెట్టను. కొన్నాళ్ళ తర్వాత నేను పోయానని తెలిసినప్పుడు 'అదేమిటి?' ఆయన ఎప్పుడో పోయాడనుకున్నామే' అని ఎవరయినా విస్తుపోతే సమాధిలో నేను నవ్వుకుంటాను" ఓ గొప్ప రచయిత మాటలివి స్థూలంగా.



మొన్న ప్రఖ్యాత నిర్మాత, ఓ దశలో జానపద చిత్రాలలో విఠలాచార్యగారి కంటే ఓ మెట్టు ఎక్కువగానే (ఈ మాట ఎందుకంటున్నానో ముందు చెప్తాను) నిలిచిన ఎస్.భావనారాయణగారు పోయారు. ఆయన వానప్రస్థంలో పడి నాకు తెలిసే పదిహేను సంవత్సరాలుపైనే అయిపోయింది. ఈ తరంలో చాలామందికి "ఒరేయ్ అక్కడ నిలబడ్డావేం?" "మళ్ళీ మాట్లాడితే చంపుతా", "పక్కింటాయన బోర్లాపడ్డాడు" వంటి సినిమాలకు అలవాటుపడిన వాళ్ళకి భావనారాయణగారెవరో తెలియకపోవచ్చు. ఆశ్చర్యం లేదు. ప్రఖ్యాత రచయిత హెన్రీ జేమ్స్ గోల్ఫ్ ఆడుకుంటున్నారట. ఆ పక్కనుంచి ఎవరో వెళుతూ 'ఆయనే హెన్రీ జేమ్స్ గొప్ప రచయిత. గోల్ఫ్ ఆయన వినోదం' అని పరిచయం చేశాడట. అప్పుడు హెన్రీ జేమ్స్ వాళ్ళని పిలిచి "మీరు పొరపాటుపడుతున్నారు బాబూ గోల్ఫ్ నా వృత్తి, రచన

చేయడం నా వినోదం" అన్నాడట. ఈ తరం వాళ్ళకి నన్ను నటుడిగా తెలిసినవాళ్ళకి 'నా వృత్తి రచన' అని చెప్పుకోవాలి. ఆ రోజుల్లో విఠలాచార్యగారిది జానపదాల మీద గుత్తాధికారం. థియేటర్లో కూర్చోమని ప్రేక్షకుల్ని ఎలా 'శాసించాలో ఆయనకు తెలుసు. అయితే వినోదాన్ని, ఉత్సుకతని కలిగించే చిత్రాల్లో కథనానికి ఎంతో కొంత 'లాజిక్'ని తెచ్చింది భావనారాయణగారు. ఆయన మేధావి. ఎక్కువగా చదువుకోని పండితుడు. అభిరుచివల్ల, అవసరం వల్ల అన్నీ క్షుణ్ణంగా చదువుకున్నవాడు. నిర్దుష్టమయిన మనిషి. ముందుగా ఆయన మాటతో, దూకుడుతో ఎదుటివాడిని బెదరకొట్టేస్తారు. కథ చెపితే ఎవరూ కాదనలేనంత పరిపూర్ణమయిన 'విశ్వాసం' ఆయన గొంతులో కనిపిస్తుంది.ఆ రోజుల్లో నేను నాలుగు సినిమాలకు పనిచేశాను. దాదాపు రెండు సంవత్సరాల ముందుగానే తెలుగులో చిరంజీవి, కన్నడంలో శంకర్‌నాగ్ భవిష్యత్తుని గుర్తుపట్టిన మనిషి భావనారాయణగారు. రెండు భాషల్లో తీసిన 'ఐ లవ్ యూ' నేను వ్రాశాను. దానికి దర్శకత్వం వహిస్తున్న ప్రఖ్యాత దర్శకులు సి.సి.రావు గారితో అభిప్రాయభేదాలొచ్చి రాత్రికి రాత్రి నన్ను బెంగుళూరు పిలిపించి దర్శకత్వం చేయమన్నారు. రెండు భాషల్లో తడుముకోకుండా చెప్పాను. చేయనని. అది వేరే కథ.

భావనారాయణగారు సంగీత ప్రియులు. మంచి ఆలోచనకు పాములాగా కదిలిపోయే మనిషి. వద్దనుకున్న విషయాన్ని, వ్యక్తినీ అంతలోనే వదిలేస్తారు. చటుక్కున మరిచిపోతారు. ఓ దశలో అయిదారేళ్ళు సినీరంగాన్ని విడిచిపెట్టి మద్రాసుకి దూరంగా ఉన్న ఫ్యాక్టరీలో కూర్చుని, మూసల తయారీలో కొత్త ఫార్ములాని కనిపెట్టి ఆ వ్యాపార రంగంలో చరిత్ర సృష్టించారు. ఏం చెయ్యదలచినా క్షుణ్ణంగా తెలుసుకుని, నిర్దుష్టంగా ఎరిగి చేసే మనిషి భావనారాయణగారు.

కొన్ని సినిమాలు కొట్టి పలకరించవు. తట్టి వెళ్ళిపోతాయి. మళ్ళీ జ్ఞాపకానికి కూడా రాకపోవచ్చు. కానీ ఆ క్షణానికి అవి నమ్మకంగా ఆనందపరుస్తాయి. భావనారాయణగారి చిత్రాలు అలాంటివి. ఆయన దాదాపు 80 చిత్రాలు నిర్మించారు. కథనీ, కథనాన్నీ తనే నిర్ణయించుకుని సినిమాలు తీసిన ఆ తరం కొద్దిమంది నిర్మాతల్లో భావనారాయణగారు ఒకరు.

ఆయన సినిమాలు తీశారుగాని, ఎప్పుడూ అనేవారు "నా భార్యని ఒక్కనాడూ నేను సినిమాకు తీసుకెళ్ళలేదండీ" అని, "మా అమ్మ ముగ్గురు కొడుకుల్ని కని, ఓ గాడిదని కన్నది, ఆ గాడిదని నేను" అనేవారు - బరువు బాధ్యతలు మోసే పనిని ఆనందంగా జీవితంలో నిర్వహించి.

జీవితాన్ని విరామం లేకుండా, అవిశ్రాంతంగా వ్యాపారం, పనులూ సాగించిన వ్యక్తి ఎప్పుడో ఒకప్పుడు అంతర్ముఖుడవుతాడు. కొండకచో మౌనమూ వహిస్తాడు. మొన్న 84వ ఏట గుండెనొప్పితో పోయారని తెలిసినప్పుడు ఆయన్ను తెలిసిన తరం గుర్తుచేసుకోవడానికీ, తెలియని తరం తెలుసుకోవడానికీ ఓ 'కాలమ్' నిడివి అవసరమనిపించింది.

*(వచ్చే నెలలో మరో ఎలిజీ)*

Post your comments